# ఉపతూద

## -కట్టుకోలు సుబ్బారెడ్డి

"గౌరవనీయులైన సంపాదకులకు,

అయ్యా!

విషయం-మీ (మా) పక్ష పత్రికలో శ్రీ ప్రహేళికగారు నిర్వహిస్తున్న పజిల్స్‌లో జనవరి మొదటి పక్షపు పజిల్ గురించి. నాలుగు అడ్డమునకు శ్రీ ప్రహేళికగారు ఇచ్చిన ఆధారం '4' అన్న అంకె మాత్రమే. నాలుగు అడ్డానికి నాలుగు గళ్లున్నాయి. దానికి సమాధానం 'ఉపతూద' అని ఫిబ్రవరిలో ప్రకటించిన దానినిబట్టి తెలుసుకుంటున్నాను. నాలుగు అనే అంకెకు 'ఉపతూద' ఎలా సమాధానమో తెలుసుకునే ప్రయత్నంలో విఫలమయిన నా మిత్రుడొకడు తపస్సు చేసి తెలుసుకుంటానూ అని తపస్సుకు వెళ్లాడని ఈ సందర్భముగా అసందర్భమైనా మీకు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం నాకు తపస్సు చేసే వ్యవధి లేనందునా, నేను తపస్సుకు వెళితే నా భార్య నన్ను చంపి పాతి పెడుతుందేమోననే భయంవల్లా తపస్సుకు వెళ్లలేకపోతున్నాను. అయినా '4' అనే అంకె ఉపతూద' అనేదానికి ఎట్లు సమాధానమో తెలుసుకోవాలనే కుతూహలం పోకపోవుటచేత సమాధానం తెలుపవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు
భవదీయుడు
శంకరరావు

**ఎడిటర్‌గారికి నమస్కారములు**

**అయ్యా!**

జనవరి నెలలోని పజిలు గురించి శంకరరావు గారి శంకను ఫిబ్రవరిలో చదివి ఇది వ్రాస్తున్నాను. 'ఉపతూద'లో నాలుగు తలకట్లున్నాయి కదా. కావున శ్రీ ప్రహేళికగారు ఆ బిట్టు అలా నిర్వహించి ఉంటారు అనే అచంచల విశ్వాసముతో ఈ విషయాన్ని మీకు రాస్తున్నాను. ఇంత చిన్న విషయానికి తపస్సుకు వెళ్లిన శంకరరావు గారి మిత్రుని బంధుమిత్ర భార్యలకు నా సానుభూతి పత్రికా ముఖముగా తెలియజేయమని మీయొక్క ఘనమును మిక్కిలిగా ప్రార్థిస్తున్నాను.

**మీవాడు**
**పరిష్కారానందం**

★★★

**అయ్యా ఎడిటరుగారూ!**

పరిష్కారానందంగారి పరిష్కారం చదివి ఈ ఉత్తరం రాస్తున్నాను. 'ఉపతూద'లోని మొదటి అక్షరం అచ్చులలోనిది. ఈవిషయం ఇంగ్లీషు కాన్వెంటులో చదివే మా మనవడు తప్ప (ఇంగ్లీషు రైమ్స్ అయితే ఇరగదీస్తాడు. ఇది తెలుగైపోయింది) ఈ వయసులో ఉన్న ఏ చిన్న పిల్లలయినా చెప్పగలరు. అచ్చులకు కూడా తలకట్లుంటాయని తన అవివేకత్వాన్ని ప్రదర్శించే పరిష్కారానందంగార్నీ వారి పరిష్కారాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మీరు మీ వివేకత్వాన్ని ప్రదర్శించాలని ఆశిస్తున్నాను, ప్రదర్శిస్తారని నమ్ముతున్నాను. శ్రీ పరిష్కారానందంగారికి, మ్యారేజీ బ్యూరో వున్నట్లుగా వీరి లేఖలోని అంతర్గత సాక్ష్యాన్నిబట్టి నేను గ్రహిస్తున్నాను. వీరికే కనుక మ్యారేజీ బ్యూరో లేకపోతే శంకరరావుగారికి భార్యలున్నారనే విషయం వీరికి తెలిసేదికాదు. అప్పుడు వీరు తమ సానుభూతిని తెలియజేయమనే సందర్భంలో 'భార్యలు' అనే బహు వచన ప్రయోగం చేసేవారు కాదు. చివరిగా శ్రీ పరిష్కారానందంగారికి ఒక విన్నపం చేస్తున్నాను. ఇలా మిమ్మ తప్పుబట్టానన్న కోపముతో మీ మ్యారేజీ బ్యూరో ద్వారా మా రెండో అబ్బాయికి పెళ్లి సంబంధంవస్తే దాన్ని చెడగొట్టవద్దని కోరుతున్నాను. అసలే ఆడపిల్లలు కరువుగా ఉన్నారు. అన్నట్లు మావాడికి ఇరవై ఆరు నడుస్తోంది. గిట్టనివాళ్లు ముప్పై మూడంటారు. నమ్మేరు సుమండీ!

**అనుగ్రహించవలెను**
**తెలుగురావు**


★★★

**మహారాజశ్రీ ఎడిటరుగారికి అనేక నమస్కారములు చేసి విన్నవించునదేమనగా!**

గత మూడుపక్షాలుగా పాఠకులు మూడు పక్షాలుగా వ్రాస్తున్న లేఖలు చూస్తున్నాను, యోచిస్తున్నాను, గ్రహిస్తున్నాను. మూడో ఉత్తరం వ్రాసిన శ్రీ తెలుగురాదుగారు అచ్చులకు తలకట్లుంటాయి, అంతర్గత సాక్ష్యాలు, తమ రెండో అబ్బాయికి పెళ్లి సంబంధాలూ అంటూ ఏవేవో వ్రాస్తూ అసలు విషయాన్ని మరిచారు. ముందుగా వారికి నేను మనవి చేసేదేమిటంటే ఇది భాషా శాస్త్ర విషయ చర్చ చేసే వేదికా కాదు, వారి అబ్బాయికి వివాహ సంబంధాలు చూసే వేదికా కాదు అని. భాషా చర్చే గనుకైతే వారు వ్రాసిన 'పెళ్ళి' అనేది తప్పు. 'పెళ్లి' అని అనాలి. అంతేగాక శ్రీ పరిష్కారానందంగారు తమ లేఖలో శంకరరావుగారి మిత్రుని 'బంధువులకూ, మిత్రులకూ, మరియు వారి భార్యకూ' అనే ఈ మూడు అంశములనూ కలగలుపు

దాము అన్న ఉద్దేశముతో 'ల'కారాన్ని బహు వచన ప్రయోజనానికి అనే ఉద్దేశ్యంతో ప్రయో గించారు. అంతేగానీ 'భార్యలు' అన్న ఉద్దేశ్యంతో కాదు.

**చిత్రగించవలెను**
**భాషాభిమాని వ్రాలు**




అయ్యా ఎడిటరుగారూ!

పోయిన పక్షంలో 'భాషాభిమాని వ్రాలు'గారు 'పక్షాలు' మీద చేసిన శ్లేష ప్రయోగ ఫలితమెట్లు న్నాగానీ నా పేరును 'తెలుగురావు'కు బదులుగా 'తెలుగురాదు' అని రాసినందుకు ఏ సంజాయిషీ ఇస్తారో ఇవ్వమనండి. వారిచ్చే సంజాయిషీ సరిగ్గా గనుక లేకుంటే...!?

**తెలుగురావు**

★★★

**మహారాజశ్రీ ఎడిటరుగారికి అనేక నమస్కారములు చేసి విన్నవించునదేమనగా!**

ఒకటవ విషయం- నన్ను అందరూ భాషాభిమానిగా కాకుండా భాషాదురభిమానిగా భావిస్తారేమోననే అనుమానముతో, భయముతో, మిమ్ములను సంపాదక మహాశయా అని సంబోధించే అవకాశమున్నప్పటికీ ఎడిటరుగారూ అని సంబోధించాను. నిజానికి మా పెద్దలు తమకు గల భాషాభిమానానికి తార్కాణంగా నా పేరు 'భాషాభిమాని' అని పెట్టారు అని తెలియజేసుకుంటున్నాను. రెండవ విషయం. శ్రీ తెలుగురావు గారంటే నాకేమీ కోపముగానీ, చులకనగానీలేదు. తెలుగురావులో 'వు' అని ఉండవలసిన చోట దానికి బదులుగా 'దు' అన్న అచ్చు తప్పుగా పడింది. దానిని కూడా నా తప్పుగానే భావించడం దురదృష్టకరం. ఈ సమాధానముతో తెలుగురావుగారు సంతృప్తి పడతారనుకుంటా. మరి నా సంతకంలోని 'వ్రాలు' అన్నదానిని నా పేరులోని భాగంగానే వారు వ్రాసి నన్ను గేలి చేయడానికి వారేం సమాధానం చెబుతారో ఎదురు చూస్తాను.

**భాషాభిమాని వ్రాలు**

★★★

**సంపాదకులకు**

ఫిబ్రవరి సంచికలోని శంకరరావుగారి శంకను నేనేమీ శంకించను. కానీ ఆ పదం 'ఉపతూద' కాదూ 'ఉపదూత' అయి వుంటుంది అని నా ఉద్దేశ్యం. నేనీ నిర్ణయానికి రావడానికి గల కారణాన్ని వివరిస్తాను. మనకు పూర్వకాలంలో దూతలు, దూతికలు ఉండేవారు. ప్రేయసీ ప్రియులు ఒండొరులు ఈ దూతలూ, దూతికల ద్వారా తమ తమ కార్యాలు కరామతులు జరుపుకునేవారు.

అంతెందుకూ శ్రీకృష్ణులవారు పాండవ దూత అనేది జగత్ప్రసిద్ధం. ఇక్కడ ఒక విషయం రాయకుండా ఉండలేకపోతున్నాను. రాయబార సందర్భానికిగానూ, తిరుపతి వెంకటకవులు రాసిన పద్యాలను మహానుభావుడు ఘంటసాల మాస్టారు ధణుతెగిరిపోయేలా పాడటం, అది వినే అదృష్టం తెలుగువారికి పట్టడం అహో... అలాగే శ్రీ ఆంజనేయస్వామివారు శ్రీరామ దూతగా చాలా ప్రసిద్ధులు. అలాగే రావణ సభకు రామ కార్యార్థం వెళ్లిన అంగదుణ్ణి కూడా మనం ఉప దూత అని భావించవచ్చు. కాబట్టి ఆ పదం 'ఉప దూత' అని నా ప్రగాఢ విశ్వాసం.

**జూనియర్ పరిశోధక బిరుదాంకిత**
**శోభనాచలపతి**

★★★

**మహారాజశ్రీ సంపాదకులవారికి**

ఈ పక్షపు పత్రికలో శ్రీ శోధనాచలపతిగారి ఉత్తరం చదివాను. 'ఉపదూత' అన్న పదం 'ఉపతూద'గా రూపాంతరం చెందింది అన్నవారి వాదం చదివి మిక్కిలి ఆనందించేను. శ్రీ....శ్రీ...గారలు బ్రతికి ఉన్నట్లైతే ఈ విషయంలో మనకు చాలా సహాయపడగలిగేవారు. ఆంధ్రులకా అదృష్టం లేదు.

ఇట్లు
'పాత గొప్ప' సంఘపు కార్యదర్శి

***

**డియర్ ఎడిటర్**

నా పేరు విశ్రాంతమ్మ. విశ్రాంతి తీసుకుంటున్నాను. శ్రీ ప్రహేళికగారిది మా పక్కిల్లే. అయినా ఇవన్నీ మీకెందుకులెండి. వారు గత కొద్ది నెలలుగా విదేశీ పర్యటనలో ఉన్నారు. రేపో మాపో రానున్నారని పనిమనిషి చెప్పింది. వాళ్లకూ మాకూ ఒకే పనిమనిషిలెండి. దీనితో వేగలేక చస్తున్నానుకోండి. రెండ్రోజులకో నాగా పెడుతుంది. ఫిల్టరు కాఫీ బాగోదట, బ్రూకాఫీ ఇవ్వాలి. ఇవ్వక చస్తానా? ఇవ్వకపోతే అది చేసే పనులన్నీ నేను చేసుకోలేక చస్తాను గానీ. అయినా ఇవన్నీ మీకెందుకులెండి. వంటల పోటీలు పెట్టినప్పుడు నాకు చెప్పండి. 'జిగట బగట' అనే పిండి వంట ఎలా తయారు చేయాలో రాసి పంపుతాను.

మొదలుపెడితే ఒక పట్టాన తెమిలి చావని వంటలలో ఇది ఒకటి. నేనొండే పిండివంటలు నచ్చని అనేకమందిలో మావారొకరు. అందుకే నేను వారినొదిలి ఒంటరిగా ఉంటున్నాను. అయినా ఇవన్నీ మీకెందుకులెండి. శ్రీ ప్రహేళికగారు కొద్దిరోజుల్లో స్వదేశం వస్తున్నారు. పజిలు విషయంలో పాఠకులకు ఉన్న సందేహాలన్నీ బహుశా వారు తీర్చగలిగే సామర్థ్యం ఉన్నవారే ననుకుంటా. ఒకసారి వాళ్లావిడ ఊరెళ్లినప్పుడు నేనొండిన కూర ఆయనకి వ్వలేదని నన్ను బోలెడు మెచ్చుకున్నారుట. అయినా ఇవన్నీ మీకెందుకు లెండి.

విశ్రాంతమ్మ

***

**సంపాదకులకూ మరియూ పాఠకులకూ నా నమస్కారములు**

గత కొద్ది మాసములుగా పజిలుకు సంబంధించి ఒక ఆధారపు విషయముపై జరుగుచున్న చర్చనంతా చూస్తున్నాను. ఇంత చిన్న విషయాన్ని వివరించడానికి శ్రీ ప్రహేళికగారే పూనుకోనక్కర్లేదు. పాఠకులకు శ్రీ ప్రహేళికగారి తరఫున వారి అభిమానినైన నేను సమాధానం చెబుతాను. 'ఉపతూద' అనే పదం 'ఉపదూత' కాదు. 'ఉపతూద'యే. 'ఉ' అనగా ఉత్తరము. 'ప' అనగా తూర్పు. ఇక మిగిలినది ద. 'ద' అనగా దక్షిణము. ఈ నాలుగు అక్షరాల పదము నాలుగు దిక్కులకు సూచన చేసే సాధనము. కావున జనవరి పజిలులో నాలుగు అడ్డానికి ఆధారంగా 4 అనే అంకెని ఆధారంగా ఇచ్చారు. అంతేగాక దీనిలో ఇంకో విశేషం కూడా ఉంది. అది కూడా వివరిస్తాను. మనం ప్రపంచ పటము లేదా దేశ పటాలు ఎదురుగా పెట్టుకున్నప్పుడు పైవైపు ఉత్తరము, ఎడమవైపు పడమర, కుడివైపు తూర్పు, క్రిందివైపు దక్షిణం ఉంటాయి. ఈ ప్రకారం 'ఉ' అన్న చోట మొదలుపెట్టి 'ప' అన్న చోటుకు ఒక ఊహారేఖను గీయండి. తిరిగి ఆ ఊహారేఖను 'తూ' వైపుకు పొడిగించండి. చివరిగా ఆ ఊహా రేఖను 'ద' వైపుకు దించండి. ఆ ఊహారేఖ నాలుగు అన్న అంకెని ఏర్పరచింది. చూడండి. ఇదీ ఈ ఉపతూద వెనుకనున్న విశేషం.


ప్రహేళికగారి అభిమాని
ప్రాడ్వివాకుడు

***

ఈ విషయముపై చర్చను ఇంతటితో ముగిస్తున్నాము. పాఠకులు ఈ విషయమై ఇంక ఉత్తరాలు రాయవలదని మనవి.

ఎడిటర్

★



## లక్కీ ప్రియాంక

సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా పేరు పొందిన ప్రియాంకా చోప్రా ఇప్పుడు సినిమాకి ఏకంగా 6 కోట్లు డిమాండ్ చేస్తోందిట. అంత ఇవ్వడానికి నిర్మాతలు సైతం ఉత్సాహం కనబరుస్తుండడం కూడా అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే ప్రియాంక వుంటే ఆ సినిమాకి మంచి ఓపెనింగ్స్ వుంటాయని ఇటీవల కొన్ని చిత్రాలు నిరూపించడంతో ఆమె క్రేజ్ అలా అలా పెరుగుతోందిట.